# ఇదీ ప్రేమే?

''ఎందుకే పైడీ కన్నట్లావాచింది? ఏం జరిగింది?"

"అదా, అమ్మగోరూ! రాత్రి దెబ్బతగిలింది"

''అదేనే ఎట్లా తగిలింది? గోడకొట్టుకుందా? గుమ్మంతగిలిందా? మీ గుడిసెలోనేనా?''

పైడికి కన్ను వాచి మూసుకుపోయింది. ఆ వాపు చెంపవరకూ వ్యాపించింది. ఎవరికీ కనబడకుండా ఉండాలని తలమీద ముసుగుకప్పుకుని ఇంట్లోకిరాబోయింది. కాని వాకిట్లోనే నరసమ్మగారు ఎదురయి ప్రశ్నలువేసింది.

జవాబు చెప్పకుండా లోపలికివెళ్ళి చీపురుతెచ్చి వాకిలి ఊడవటం మొదలు పెట్టింది.

''అమ్మాయీ సుశీ, పైడికన్ను చూశావా? ఎంత దెబ్బతగిలిందో ఏమిటో కన్ను మూసుకుపోయింది.''

గబగబా సుశీ వాకిట్లోకి వచ్చింది. పైడి తలవంచుకుని ఊడుస్తునేఉంది.

''పైడీ! ఏమయింది? మళ్ళీ కొట్టాడా? నీవు వాడికి డబ్బెందుకిస్తావు? ఇచ్చి దెబ్బలు తింటావు. అద్దంలోచూసుకో-ఆ కన్నెట్లా వాచిందో? ఎంతిచ్చావేమిటి?" సుశీ పైడికన్ను పరీక్షగాచూస్తూ అడిగింది.

పైడిముఖం తిప్పుకుందిగాని మాట్లాడలేదు.

''ఆ కన్నట్లా పెట్టుకుని పనిచేస్తుంటే గుడ్డిదానవైపోతావు. డాక్టరికి చూపించుకో. చూసి మందువేస్తాడు.''

పైడి మాట్లాడకుండా వాకిలిఊడ్చి నీళ్ళుచల్లి ముగ్గువేసింది. పెరట్లోకి బయలుదేరింది ఊడవటానికి.

సుశీ దానిచేతిలోనుంచి చీపురులాక్కుని ''ఊడిస్తే కంట్లోదుమ్ము పడుతుంది. మేము ఊడ్చుకుంటాము. ముందు డాక్టరుగారి దగ్గరికివెళ్లు. మందువేసి కట్టుకడ తాడు. వెళ్లు" అన్నది.

పైడి తలవంచుకుని నిలబడిపోయింది.

''నిలబడతావేం? వెళ్లు. ఆయన మళ్లీ ఎక్కడికయినా వెళ్తాడు ఆలస్యం చేస్తే''

''ఏంచెయ్యనమ్మగోరూ? ఎట్టాయెళ్ళేది?"

''ఎట్లా ఏముంది? నీకు ఇల్లు తెలుసుగా?''

''ఇల్లు తెలుసు అమ్మగోరూ? చేతిలో ఏంలేకుండాపోతే మందిస్తాడా అమ్మగోరూ?"

''నిన్ననేగా అమ్మ యిమ్మంటే పదిహేను రూపాయలిచ్చాను?"

''అవునమ్మగోరూ''

''ఏంచేశావు? నూకలు కొన్నావా?''

''లేదండి''

''మరేం కొన్నావు?''

"మరండీ, నూకలు కొంటానికి బజారుకుపోతా ఆ డెదురుగా వచ్చి....

"ఆ డబ్బుకాస్తా తీసుకుపొయ్యాడా?"

''నేనియ్యలేదమ్మగోరూ? అడిని చూడగానే ఇంటికి పరుగుతీశానండి. ఆడు నాయెంటబడి గుడిసెలోకొచ్చి ఇమ్మన్నడండి. ఇయ్యకపోతే బలంగా గుంజుకున్న డండి. గుంజినప్పుడు నేను పక్కకు పడిపోయినానండి. కింద కట్టెపేళ్ళున్నాయి. అయి ముఖానికి తగిలి కన్నిట్లయిపోనాది'' ముఖాన్ని చేతులతో కప్పుకుంది.

"అయ్యయ్యో. ఆ పేడు కంట్లో గుచ్చుకుందేమో? ఇంతకూ డబ్బులు లేవం టావు? పద, నేనువస్తా డాక్టరు దగ్గరికి'' లోపలికి వెళ్ళి చెప్పులువేసుకుని పర్సు తీసుకు వచ్చింది సుశీ.

"ఎందుకమ్మగోరూ అదేపోతది. ఇట్టాటివెన్ని తగిలాయో? వద్దమ్మగోరూ"

కన్నుపోతే గుడ్డిదానవైపోతావు. అప్పుడు తిండి ఎవరు పెడతారు? మీవాడు పెడతాడా? రాపోదాం. నేను మళ్లీ ఆఫీసుకు పోవాలి" సుశీ పైడిని చెయ్యిపట్టుకుని లాక్కుపోయింది.

డాక్టరు క్లినిక్కు బయలుదేరబోతున్నాడు.

"డాక్టరుగారూ. మా పైడి కంటికి దెబ్బతగిలింది కాస్త చూడండి''

"నాకు టైమయిందమ్మా, క్లినిక్కు తీసుకురా చూస్తా" ఆయన కార్లో వెళ్లిపోయాడు.

సుశీకేం తోచలేదు. పైడి ముఖంచూస్తే జాలివేస్తోంది. తనకు ఆఫీసుకు వెళ్ళే టైమవుతోంది. ఇంక ఆటోలో ఆఫీసుకువెళ్లాలి. రిక్షాలో పైడిని క్లినిక్కు తీసుకు పోయింది.

పైడి కన్ను పరీక్షచేసి, ఒకచిన్న పనిముట్టుతో ముల్లులా ఉన్న పేడును గుడ్డుమీదినుంచి తీసి సుశీకి చూపించాడు.

"వీళ్లంతా ఇంతేనమ్మా, బాగా తాగి కొట్టుకుంటారు-ఒళ్లు తెలియకుండా. మెల్లగా వాపు తగ్గిపోతుంది. తీసుకెళ్ళు" అన్నాడు.

''డాక్టరుగారూ, మీ ఫీజు?''

"ఏమిటమ్మా ఈ కాస్తదానికి నాకు ఫీజా? వెళ్ళు. మీ అమ్మగారికి చెప్పు దీనిసంగతి" అన్నాడు సుశీని మందలిస్తూ.

"డాక్టరుగారూ. దీనికి కన్నుపోయినట్టుగా కట్టుకట్టేయండి. కన్ను పోయిందని వాడికి చెప్పి భయపెడతాను"

"దీనికి భయపడతాడావాడు? ఇలా ఎన్నిసార్లు జరిగిందో? అయినా కట్టు కడతాలే'' కంటిమీద దూదిపెట్టి కట్టుకట్టాడు.

సుశీ పైడిని మెల్లగా ఇంటికి తీసుకొచ్చింది. దానికి ఓ కప్పు టీ చేసియిచ్చి వసారాలో చాపమీద పాత దుప్పటిఇచ్చి పడుకోమన్నది.

సుశీ ఆఫీసుకు వెళ్లిన తరువాత, నరసమ్మగారు అన్నం పెట్టింది పైడికి. అన్నంతిని నిద్రపోయింది పైడి.

పైడికి నిండా పాతికేళ్ళులేవు. తండ్రిపోయిన తరువాత తల్లి పాచిపని చేసుకుంటూ పిల్లను పెంచింది. తల్లికి వయసుమళ్లిన తరువాత పైడి పాచిపనులు చెయ్యటం మొదలుపెట్టింది. ఆ పేటలో రాజుగారింటి పాలేరు రామిగాడు దానిని వెంబడించటం మొదలుపెట్టాడు. కులంలోని వాళ్లందరు పైడికి పెళ్ళి చెయ్యమని తొందర పెట్టారు. "ఈడొచ్చిన పిల్లను పాచిపన్లకు పెట్టకు. ఏరోజెటువంటిదో జాగ్రత్తగా చూసుకో పిల్లను'' అన్నారు.

"తొందరపడితే మనువు దొరుకుద్దా బాబూ?'' అనేది పైడి తల్లి.

''పైడి చామనచాయగా ఉన్నా పెద్ద పెద్ద కళ్ళు, కళగల ముఖం. తల వెంట్రుకలు జానెడేగాని ఉంగరాలు తిరిగి ముఖమ్మీద పడేవి. ఆ వెంట్రుకలనే సాగదీసి ముడిపెట్టుకునేది. నల్లటిరంగు-తెల్లటిపళ్ళు మరొకసారి ముఖం చూద్దామనిపించేది. చెవులకు గిల్టుకమ్మలూ చేతులకు వెండి మురుగులూ మెడలోపూసలదండ చూడముచ్చటగా ఉందని'' అనుకునేవాళ్ళు పాచిపని చేసినచోట.

తల్లి తనకళ్లముందర ఉండేవాడికి పైడిని నివ్వాలనుకునేది. పైడి చప్పున ఎవరినీ మెచ్చేదికాదు. చివరకు రామిగాడితో పెళ్ళి జరిపించాలని నిశ్చయించుకుని పిలిపించి అడిగింది.

రామిగాడికి ఏనుగనెక్కినంత సంబరంగాఉంది పైడితల్లి పిలిచిందనగానే.

''చూడు. నా పిల్లను కష్టపెడితివా నేనూరుకునే మడిసినికాను. అది నా యింట్లనేఉంటంది. నీవే ఇక్కడొచ్చిఉండు. ఈ గుడిసెనాది. ఈ జాగాకూడా నాదే నీకు దోతులుకొనిస్తా. చొక్కాకుట్టిస్తా. తాళిబొట్టుకూడా నేనేఇస్తా. చేసుకుంటవా పైడిని?''

''అట్లనే అత్తమ్మా''

రాజుగారిని డబ్బడిగి రామిగాడు పైడికి చెవులకు కమ్మలు చేయించాడు. చీరె రైక తీసుకొచ్చాడు పైడి తల్లి చేతికిచ్చిన తాళి పైడిమెడలోకట్టాడు. గ్యాస్ లైటు వెలుగులో పైడిపెళ్ళిజరిగింది. ఆ గూడెంవాళ్లకు విందుచేసింది పైడి తల్లి.

గుడిసె వాళ్లిద్దరికీఇచ్చి, పైడి తల్లి వాకిటరుగుమీద పడుకునేది.

రామిగాడంటే పైడికి మొదటినుంచీ మోజే. లుంగీమీద పొట్టిచేతుల చొక్కా-వేసుకుని తలకో తువాలు చుట్టుకుని సిగరెట్టుకాలుస్తూ పొగవదుల్తూ నడుస్తుంటే, వాడు పైడికంటికి హీరోలా కనుపించేవాడు. రాజుగారి పాత చెప్పులేసుకుని వాడు ఠీవిగా నడుస్తుంటే వెనకనుంచిచూసి మురిసిపోయేది. ఎప్పుడో ఆరు నెలల నాడు చూసిన సినెమాలోని గంగన్నను గురించీ ఆ పాటనుగురించీ వాడు చెబుతుంటే దాని ముఖం వెలిగిపోయేది. అట్లా కబుర్లుచెప్పిచెప్పి, కొంగుకుకట్టుకున్న డబ్బులు తీసుకుపోయేవాడు. మొదట్లో వాడేంచేసినా దానికి వీరోచితంగా ఉండేది. ఒకటి రెండు దెబ్బలు తగిలినా మురిసిపోతూ తెల్లటిపళ్ళు కనబడేటట్టుగా నవ్వుతూ సహించేది.

నాలుగిళ్ళలో పాచిపనిచేసి రెండువందలపైన పైడి సంపాదించేది. రామిగాడికి నాలుగు బస్తాలవడ్లు రాజుగారిచ్చేవారు. భోజనం వాళ్ళింట్లోనే చేసేవాడు. నాలుగుబస్తాలవడ్లలో రెండు పైడికి ఇంట్లో ఇచ్చేవాడు. మిగతా రెండూ అమ్మి చిల్లరఖర్చులు అంటే సినిమాలూ, బీడీలకు వాడుకునేవాడు. కాని-వాడికి చాలేవి కావు. అందుకే పైడిని డబ్బుకు పీడించేవాడు.

బియ్యంధర పెరిగిందని పైడికి పాచిపనులుచేసే ఇళ్ళల్లో అన్నందొరకటం లేదు. నాలుగిళ్ళల్లో పనిచేసి ఆ గిన్నెల్లోది తుడుచుకుని తిన్నప్పటికీ దాని కడుపు నిండేదికాదు. రామిగాడిచ్చినవడ్లు ఏటికేడాది సరిపొయ్యేవికావు. నూకలు తెచ్చుకుని వండి తల్లికిపెట్టి తాను తినేది.

నరసమ్మగారింట్లో పని చెయ్యటం మొదలుపెట్టిన తరువాత - సుశీనిచూసి రోజూ స్నానం చెయ్యటమూ, తలదువ్వుకుని ఆమెను రిబ్బనడిగి తలవెంట్రుకలు కట్టుకోవటమూ, అమ్మాయిగారినడిగి పౌడరు చేతిలో వేయించుకుని ముఖానికి అద్దుకోవటమూ, దోసగింజబొట్టు పెట్టుకోవటమూ, ఆమె కట్టినట్టే చీర కట్టుకోవటమూ నేర్చింది.

పైడినిచూచిన రామిగాడి కళ్లు మెరిసిపోయేవి.

''సినిమాలోకి యెళ్తావేటి సోకులు నేరుస్తున్నవ్?'' అనేవాడు రామిగాడు కనుబొమలెగరవేస్తూ.

"నే నెళ్లనుగాని నీవే యెళ్తావు ఎన్నడైనా. బీడీలుమాని సిగరెట్లలోకి దిగినావు''

వాడు తిప్పుకోలేనంతగా సంబరపడిపోయేవాడు.

నెలకోసారయినా సినిమాకు పోదామని పైడి పట్టుబట్టేది.

''యాడివేడబ్బులు? ఇద్దరికీ చెరొకటికెట్టుకావాలా? అక్కడేమన్న తినటానికి కావాలా? నేను టీ తాగి కారాకిళ్లి యేసుకోవాలా? నీ దగ్గరుంటే ఇయ్యి. సినిమా చూపిస్త'' అనేవాడు.

''ఓయమ్మో? అన్నీ కలిపి పదిరూపాయలపైన ఖర్చుచేస్తవు. నా దగ్గ రెక్కడివి?"

''డబ్బుల్లేకపోతే ఊకో. నీ జీతమేంచేస్తున్నవే?''

"తిండికి చాలటంలేదు. అమ్మకు దగ్గు. మందులేయించాలె. అయినా- పెళ్ళయిన కాడినుంచి ఒక్క చీరెయినా తెచ్చినవా? రైక తొడిగించినవా? చేతులకు గాజులు వేయించినవా? ఊకె డబ్బులడుగుతవుగాని''

''తాళి కట్టించుకున్ననాడెరగవా? నా సంపాదనేటో? రాజుగారే తిండి పెడతరు. గుడ్డలిస్తరు. ఆరే అన్నంపెడతరు. చెప్పులుకూడాఆరివే. కాని-పైసలు చేతికిస్తరనుకున్నవా? పైసల సంపాదననీది. ఈ ఖర్చంత నీవేపెట్టాలి.

పైడి మనసు బంగారంలాంటిది. కొంతసేపు వాదించి వాడి చేతిలో పైసలు పోసేది. వాడు "ఏటనుకున్నావు రాములంటే?" అనేవాడు ధీమాగా మీసాలు దువ్వుకుంటూ.

పైడి మనసు వెన్నలా కరిగిపోయేది. ఇట్టే పొంగిపోయేది. వాడి కబుర్లువిని ''మగాడంటే ఆడే'' అని గర్వపడేది.

ఎప్పుడైనా కోపంవస్తే మాట్లాడకుండా నాలుగు రోజులు కనబడకుండా పోయేవాడు.

ఆ నాలుగురోజులూ తిండయినాతినకుండా వాడికోసం ఎదురుచూసేది పైడి.

''నాకేం పోయేకాలంవచ్చింది? ఆడిని అన్ని మాటలంటే కోపంరాదా?

మగాడన్నవాడికి రోషంరాదా?" అని పశ్చాత్తాప పడేది. రామిగాడికోసం ప్రాణం గిలగిల కొట్టుకుపోయేది. వాడు తిరిగి యింటికిరాగానే చేటంత ముఖంచేసుకుని ఇన్నాళ్లెక్కడికి పోయినవే'' అంటూ రెండుచేతులూ వట్టుకునేది. వాడు నూనె బాగా పట్టించుకుని దువ్వుకున్న నిగనిగలాడే క్రాపుతో సెంటుచుక్కలు చిలకరించుకున్న చొక్కా తోవచ్చి, మొలకనవ్వులు ఒలకపోసేవాడు. వాడికి పట్టాభిషేకం చేసినంతపని చేసేది పైడి.

రాజుగారికొడుకు పట్నంలో చదువుతున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చేవాడు. ఇస్త్రీబట్టలు వేసుకునేవాడు. బాగా సిగరెట్లు తాగేవాడు. అదిగో-అప్పుడే రామిగాడికి సిగరెట్లు అలవాటయ్యాయి. లేకపోతే వాడికెక్కడివి? అంతకుముందు రాజుగారూ చిన్నయ్యగారూ పిలిచినప్పుడు తాగుతున్న బీడీ ఆర్పేసి తలకుచుట్టిన తువాలలో దాచేవాడు.

ఈ మధ్య రాజుగారి అబ్బాయి పట్నంనుంచివస్తూ సీసాలు తీసుకురావటం మొదలుపెట్టాడు. వీడు ఎదురుగానిలబడి గుటకలు మింగుతుంటే నాలుగుచుక్కలు సీసాలో మిగిల్చేవాడు.

అదీ వాడికి కొత్తగా అయిన అలవాటు. ఆ మోజులో నాలుగు రోజులు యింటికి రాలేదు.

చిన్నయ్యగారున్నన్నాళ్లూ సీసాల మందు నాలుగుచుక్కలయినా దొరికేవి. ఆయన ఊరికి వెళ్ళగానే నాటుసారా పట్టించేవాడు. అయినా-ఆ నాలుగు చుక్కల రుచి ఎక్కడ? కుండలోని నాటుసారా రుచి ఎక్కడ?

ఏమాటకామాటే అనుకునేవాడు-దీనిషాటు దాని కెక్కడిది అని.

ఈ కొత్త అలవాటుతో ఇద్దరి మధ్యా తగాదాలలో చిలిపితనంపోయి కరుకుదనం చోటుచేసుకోవటం మొదలైంది.

కుక్కి మంచంలో దగ్గుతూ పడుకున్న పైడితల్లికి చిరాకుపుట్టేది. అరుస్తూ ఉండేది. రామిగాడిని తిడుతూఉండేది.

"ఆ ముసల్ది గుటుక్కుమంటేగాని నీ పొగరణగదే పైడి'' అనేవాడు రోషంతో రామిగాడు.

"నన్నను, దాన్నెందుకంటవు? అదుంటేనే నేను బతికేది-నీకు డబ్బులు దొరికేదీను. నోరు పారేసుకోమాక'' అంటూ చిటపటలాడేది పైడి.

డబ్బుకోసం వాడు పీడించటం-ఇవ్వనని పైడి బిగించటం, వాడు పైడిని కాళ్ళతో చేతులతో మర్దించటం, ఏడుస్తూ పైడి ఇచ్చిన తరువాత తిట్టుకోవటం ఇద్దరికి అలవాటయింది.

ఇదివరలో ఈ రభస వారానికొకసారి జరిగేది. ఇప్పుడు దినచర్య అయింది.

పైడి గుడిసె ఇళ్ళమధ్య ఉండటంచేత అరుపులూ అల్లరులూ ఏడుపులూ చుట్టుపక్కలవాళ్ళకూ అలవాటయినా, వీళ్ళమీద అరిచేవాళ్లు. కాని-ఆ గుడిసె, ఆ స్థలం పైడి తల్లిస్వంతం. పొమ్మంటే ఎక్కడికిపోతారు? కొంచెంసేపరచి ఊరుకునేవారు.

పైడి తల్లికి చలికాలంరాగానే దగ్గు ఎక్కువయ్యేది. ఈసారి దగ్గుతోపాటు జ్వరంకూడా వచ్చింది. శ్రద్ధగా మందు ఇప్పించింది పైడి. కాని-దానికి తల్లి దక్కలేదు.

పైడి ఆ దిగులుతో పదిరోజులపాటు పనికిపోలేదు. దానికి తిండికీ వాడి తాగుడుకూ డబ్బులేక ఇద్దరిమధ్యా తగాదాలు మళ్ళీ మొదలయ్యాయి.

డబ్బుకోసం పైడి తిరిగి పనిలోచేరింది. వాళ్ళ నిత్యజీవితం యథాప్రకారంగా సాగిపోతూ వచ్చింది.

''ఆ ముసల్దిపోయినంక నాకు మనసు నెమ్మదయింది. వచ్చినప్పుడల్లా తిట్టేది" అంటూ ఉండేవాడు రామిగాడు దాన్ని ఉడికించటానికి.

''అదిగో- ఆమాటంటే నాక్కోపమొస్తది. అదేంచేసిందని అట్టంటవ్ ? అది పోయిందని నేను ఏడుస్తాఉంటే?'' ఇద్దరిమధ్య చిటపటలురేగేవి. కొంత సేపయిన తరువాత నవ్వుకుంటూ ఉండేవాళ్లు.

ఒకనాడు ఇద్దరిమధ్యా మాటా మాటా పెరిగింది. వాడు కోపం పట్టలేక పైడి చేతిలోనుంచి డబ్బులు విసురుగా లాక్కున్నాడు. గుడిసెముందరున్న రాళ్ల మీద పడ్డది పైడి. తలకుబాగా దెబ్బతగిలి రక్తం కారటం మొదలుపెట్టింది.

రక్తాన్ని చూసి రామిగాడికి భయమేసింది. కనబడకుండా పోయాడు. పైట కొంగుతో గాయాన్ని నొక్కిపట్టుకుని ఏడుస్తూ నరసమ్మగారింటికి వెళ్ళింది.

సుశీ గబగబా గదిలోనుంచి వచ్చి ''ఏమయింది మళ్ళా? రక్తంతో చీరంతా అలా తడిసిపోయిందేమిటి ? మళ్ళీ కొట్టుకున్నారా ? మీకిద్దరికీ ఎప్పుడు బుద్ధి వస్తుందో ? పద డాక్టరు దగ్గరికి'' తీసుకువెళ్ళింది.

''పెద్ద దెబ్బే తగిలింది. కుట్లువెయ్యాలి'' అంటూ గాయంచుట్టూ వెంట్రుకలు కత్తిరించి శుభ్రంచేసి కుట్లువేశాడు. కట్టుకట్టి ఒక ఇంజక్షనిచ్చి మాత్రలతో పంపించాడు డాక్టరు.

మాత్రవేసి చాపమీద పడుకోబెట్టి చీరెకప్పింది సుశీ. కొంచెం సేపటికి నిద్రలోకి జారుకుంది పైడి. ఆవిధంగా నాలుగైదుసార్లు డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళవలసి వచ్చింది. గాయం మానేవరకూ పైడి వాళ్ళింటోనే ఉండిపోయింది.

గాయం మానుతున్నకొద్దీ పైడికి రామిగాడి మీద ధ్యాసమళ్లటం మొదలుపెట్టింది. తనను చూడటానికి ఒక్కసారయినా రాలేదని పదే పదే అనుకునేది. ముఖం చిన్నబుచ్చుకుని ఉండేది.

"పైడీ, గాయం మానిపోయింది. నొప్పిలేదు. ఇంకా ముఖమట్లా పెట్టుక్కూర్చున్నావేం ? ఇంకా మీ అమ్మమీద బెంగేనా ?'' అడిగింది సుశీ.

"అమ్మాయిగారూ ఇంక నేను ఇంటికి పోతానండి."

"ఇంటికెందుకే మళ్ళీ దెబ్బలు తినటానికా ? ఈసారి తలకు దెబ్బతగిలితే ముక్క చెక్కలవుతుంది. ఆ గుడిసె అద్దెకిచ్చి ఇక్కడే ఉండు. రామిగాణ్ణి మర్చిపో. లేకపోతే నీబాధలు మళ్ళీ మొదలవుతాయి" అంది మందలిస్తూ సుశీ.

"అదికాదమ్మాయిగోరూ. నేనిక్కడుంటే ఆడు సూడటానికియినా రాడు."

''వాడికి చూడాలని లేదేమో ? చూడాలని ఉంటే ఇక్కడికి ఎందుకు రాడు ?"

"రాడమ్మగోరూ. వస్తే మీరు ఏమయినా అంటారు కదా?''

''ఆ భయం ఉందికదా? వాణ్ణి అసలు పోలీసులకు పట్టించాలనుంది నాకు."

"కోపంవస్తే పట్టలేక కొడ్తాడుగాని ఆడి మనసు మంచిదమ్మాయిగోరూ. నన్నుకొట్టి తానేడుస్తడు. "నాచేతులిరిగిపోను'' అని తిట్టుకుంటాడు. ఎట్టున్నడో ఏమో ? నా మనసంతా ఆడిమీదనే ఉంది అమ్మాయిగోరూ !"

పైడి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

''పైడీ, నీవు దెబ్బలుతింటావు. మళ్ళీ వాడికోసం ఏడుస్తావు. నిన్నేమనాలో నాకు తెలియటంలేదు. అయినా అమ్మ నడుగు ఏమంటుందో ?"

అంతా విన్న నరసమ్మగారు "కొట్టినా తిట్టినా వాడిదగ్గరకే వెళ్తానంటావేం?" అన్నది నవ్వుతూ.

''ఆడు మంచోడమ్మగోరూ. నన్ను సూడకుండ ఉండలేడు. ఆడు ఇక్కడికి రాడు. నేను పోతానమ్మగోరూ ?'' కళ్ళనీళ్లు కారుతున్నాయి.

''సరే. నీయిష్టం'' అన్నదామె.

''అది వెళ్తానంటే నీవుకూడా వెళ్ళమంటావా అమ్మా ? ఇటువంటి వాళ్ళకు బుద్ధి చెప్పాలి. వాడు దుష్టుడని ఇంకా తెలియలేదా నీకు?''

"అమ్మాయీ, జీవితమంటే ఇదే. కొట్టుకున్నా తిట్టుకున్నా వాళ్ళు ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. వాడు లోపలికి రాలేదుగాని గేటవతల కూర్చుని దాని కోసం ఏడుస్తుంటే నేను అనేకసార్లు చూశాను. పైడికూడా కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నది. వాళ్ళను విడదీయాలని చూడటం మంచిది కాదు. నీ చీరె రవిక ఇవ్వు కట్టుకుంటుంది. ఇన్నాళ్ళు మనింట్లో పడుంది. నాలుగు రూపాయలిచ్చి పంపించు. సంతోషంగా వెళ్తుంది.''

''ఇంకా డబ్బెందుకు ? వాడు తీసుకుంటాడు మళ్ళీ''.

''ఇంతపెద్ద శిక్షవేశావు. చాలు పంపించు, ఇంకా అట్లా చేయడులే."

"మరి, వాళ్ల జీవితాలు ఎట్లా బాగుపడతాయి మనమిట్లా చేస్తుంటే ?"

"ఆ జీవితాలంతే. వాళ్ళేమిటి ? మనమేమిటి ? అంతా ఒక్కటే ఈ విషయంలో. ఒక సంగతి గమనించు. దానికీ వాడిమీద ప్రేమఉంది. వాడికీ ఉంది. ఇప్పుడు కొట్టుకుంటారు. మరి కాసేపటికి నవ్వుతూ కలుస్తారు. అనాగరీకులు కనుక మనవాళ్ళలాగ ప్రేమను పైకి చూపించుకోలేరు. సినీమాలోలాగ మన

ఇళ్లల్లో ప్రేమ ఎంత బహిర్గతంగా కనబడతోందా ? అంతమాత్రాన మన వాళ్లకు ప్రేమ లేదనుకుంటామా ? చూడు సుశీ, ఏరూపంలో బహిర్గతమయినా ప్రేమ ప్రేమే. పైకి కనబడకుండా హృదయమంతా ప్రేమతో నింపుకున్నవాళ్ళున్నారు. లోతుగా చూస్తేనే గాని తెలియని రకమది. ప్రేమలో అనేకరకాలు. కొందరు తల్లులు పిల్లలను ఏడిపించి ముద్దుపెట్టుకుంటారు. ఆ బిడ్డమీద తల్లికి ప్రేమ లేదనుకుందామా? పైకి వ్యక్తంచేయటంలో తేడాలు అంతే. ఇంక వాళ్ళను ఏడిపించకు. నాలుగు చివాట్లేసి జాగ్రత్తగా ఉండమని చెప్పి పంపించు'' అన్నది.

"ఎంతదీర్ఘమైన ఉపన్యాసమిచ్చావు ? నేను పంపిస్తాను. కాని వాళ్ల బాధ్యత నీదే" అంది సుశీ. ఆమెకు తల్లి వాళ్ళను అంతగా నమ్మటం నచ్చలేదు.

నరసమ్మగారి మాటలతో పైడికి ధైర్యం వచ్చింది. సుశీ మాటలలోఉన్న అంతరార్థం గ్రహించింది.

ఇద్దరికీ దణ్ణంపెడుతూ "మీ యిద్దరి మాటలూను బుర్రకెక్కినయి అమ్మగోరూ. ఈసారి ఏమైనా ఆడిని తీసుకొచ్చి మీ కాళ్ళమీద పడేస్తా సూడం డమ్మాయిగోరూ ? మీరన్నట్టు ఆడికి బుద్ధి చెప్పేటోళ్ళు లేక నన్నిట్లు ఆడిస్తాన్నడు."

''ఇంటికి వెళ్ళుతున్నానన్న సంతోషంతో ముసిముసి నవ్వులతో చాటంత ముఖం చేసుకుని వెళ్ళింది పైడి రామిగాడి కోసం'' అంటుంది సుశీ

''అమ్మా. నీవెన్నయినా చెప్పు. అది హింసించటం కిందికి వస్తుంది. కోర్టుకుపోతే విడాకులిప్పిస్తారు లాయర్లు. ఇప్పుడు నీ బలవంతమ్మీద పంపిస్తున్నా. ఇంకొకసారి ఇట్లా జరిగితే నేనే వాడిమీద కేసుపెడతా భార్యను హింసిస్తున్నాడని."

''కేసుపెడతావా ? వీడిని వదిలించుకొని ఇంకొకడిని చేసుకుంటే వాడు మాత్రం బాగా ఉంటాడా కొట్టకుండా తిట్టకుండా ? నీవు గ్యారంటీ ఇస్తావా ? వీళ్లే సర్దుకుంటారు ఈశిక్షతో. బుద్ధితెచ్చుకుంటారులే. పంపించావుగా ! ఒక రెండునెలలు చూడు.''

నరసమ్మగారికి ఆజోడును విడదీయటం ఇష్టంలేదు. వాళ్లకూ ప్రేమ ఉంది. "అదీ ప్రేమే" అంటుందామె మనసు.

సుశీ వాదిస్తుంది.

"అదీ ప్రేమే కాని క్రూరంగా లేదూ ?'' *